# ॥ అతిథి దేవో భవ ॥

(నాటిక)

రచన

శ్రీ మొదలి నాగభూషణ శర్మ

రసరంజని రంగస్థల గ్రంథాలయము

భాగ్యనగరము * తెలంగాణ * భారతదేశము

## || మనవి ||

మా ఈ "రసరంజని రంగస్థల గ్రంథాలయము" లో గల వివిధ - పద్య, గద్య - నాటకములు, నాటికలు, రంగస్థల గ్రంథములు - ప్రస్తుతం లభ్యములు, అలభ్యములు అయినవి - DTP చేయబడుచున్నవి. అల్లే వివిధ రచయిత(త్రి)ల, ముద్రణాలయముల అనుమతి తీసుకొనక పోయిననూ ఇప్పటికి లభ్యమైన, అలభ్యమైన నాటక గ్రంథములు సేకరించి, ఆ గ్రంథములలో అక్షరములు అస్పష్టతగా ఉండుట వలన, స్పష్టత కొఱకు, అక్షర దోషములు లేకుండ DTP చేసి, PDF లు గా మార్చబడుచున్నవి.

ఈ ప్రయోగము కేవలం తెలుగు నాటక సమాజముల వారికి, నాటక దర్శకులకు, నటీనటులకు, నాటక ప్రియులకు, ఇతర గ్రంథాలయములకు, ముద్రణాలయముల ఉపయోగార్థము చేయబడుచున్నవి.

ఈ DTP చేయబడిన నాటక గ్రంథముల ప్రతులు మాత్రమే A4 సైజు లో "రసరంజని రంగస్థల గ్రంథాలయము" లో పొందవచ్చును. ఇవి PDFలు గా మాత్రమే ఇవ్వబడును. ఈ DTP చేయబడిన నాటక/నాటిక/రంగస్థల గ్రంథములు వ్యాపార దృక్పథంతో చేయుచున్నవి కాదు.

అల్లే ప్రతి గ్రంథము పై "Copyright" చట్టము ప్రకారము ప్రతీ నాటిక లేక నాటకము లేక నాటక విషయ గ్రంథమును ఉపయోగించుటకు లేక ప్రదర్శించుటకు ముందు ఆయా సమాజముల వారు రచయిత(త్రి) లేక ముద్రణాలయముల దగ్గర తప్పనిసరిగా లిఖితపూర్వక అనుమతిని తీసుకొనవలెను. ఇందులో "అనుమతి పత్రము" నమూనా కూడా జత పరచడమైనది అని తెలుపుట గమనించగలరు.

ఇది "రసరంజని రంగస్థల గ్రంథాలయము" సంస్థ చేయు తెలుగు రంగస్థల సేవగా రచయిత(త్రి)లు, ముద్రణాలయములు భావించ ప్రార్థన.

రచనల సేకరణ కొనసాగుతున్నది. రచయిత(త్రు)లు తమ విలువయిన రచనలను, సేకరణలను ఫోటో కాపీ రూపములోనయినా సరే మా "రసరంజని రంగస్థల గ్రంథాలయము" నకు అందించి సహకరించ ప్రార్థన.

మా ఈ "రసరంజని రంగస్థల గ్రంథాలయము" నకు సాదరంగాను, అభిమానంతోనూ, తమ వద్ధ నున్న నాటక గ్రంథముల ప్రతులను అందించి మమ్మ ప్రోత్సహిస్తున్న, మహానుభావులకు మా హృదయపూర్వక ధన్యవాదములు !

**రసరంజని రంగస్థల గ్రంథాలయము**

|| అనుమతి పత్రము ||

తేదీ : ..........................................

ఈ "అతిథి దేవో భవ" నాటికను ప్రదర్శించుటకు

M/s ........................................................................................................................

(సమాజము పేరు)

నాటక సమాజము వారు మా అనుమతి కొరకు మమ్ము సంప్రదించుటచే, ఈ నాటికను వారు అత్యంత శ్రద్ధతో ప్రదర్శించెదరని ఆశిస్తూ, మా అనుమతిని లిఖిత పూర్వకము గా నిస్తున్నాము. వారి ప్రదర్శన దిగ్విజయంగా జరగాలని కోరుకుంటున్నాము.

ఇట్లు

మొదలి నాగభూషణ శర్మ

రచయిత

రచయిత చిరునామా :

..........................................

..........................................

..........................................

..........................................

---

**Copyright** చట్టము ప్రకారము ప్రతీ నాటిక లేక నాటకము లేక నాటక విషయ గ్రంథములను ఉపయోగించుటకు లేక ప్రదర్శించుటకు ముందు ఆయా సమాజముల వారు రచయిత(త్రి) లేక ముద్రణాలయముల దగ్గర తప్పనిసరిగా లిఖితపూర్వక అనుమతిని తీసుకొనవలెను.

అందుకై ఈ "అనుమతి పత్రం" జత పరచడమైనది.

RASARANJANI THEATRE
VEMPATI RADHAKRISHNA
COLLECTION
LIBRARY
RASARANJANI

# ॥ అతిథి దేవో భవ ॥

(నాటిక)

## ॥ ఇందులో పాత్రలు ॥

అవాక్కుల సన్యాసయ్య ...................... అతిథి
దూర్వాసుల శాంతమూర్తి ............ ఇంటాయన
అతిమధురం .................................. ఇంటావిడ
నక్కా చెవులయ్య ...................... ఇంటి నౌకరు

# || అతిథి దేవో భవ ||

(నాటిక)

(ఓ మధ్య తరగతి కుటుంబీకుల ఇంట్లో ముందుగది. ఓ పక్క మూడు కుర్చీలు, ఓ విరిగిన ముక్కాలి పీట. బయట తలుపు కొట్టిన చప్పుడు ... Stage మీద ఎవ్వరూ లేరు ... మళ్ళీ తలుపు చప్పుడు ... "ఎవరూ ? ... వస్తున్నా? " అని లోపలి నుంచి కేక ... తలుపు తోసిన శబ్దం ... మెల్లగా తలుపు తోసుకొని అవాక్కుల సన్యాసయ్య వస్తాడు)

సన్యాసయ్య : (లోపలికి వస్తూ గదిని పరిశీలించి) ఎవ్వరూ ఉన్నట్టు లేరే ! ... ఎవరండీ లోపల ? ... శాంతమూర్తిగారూ ... శాంతమూర్తిగారూ !

(వచ్చె, వచ్చె ... అని లోపలి నుంచి కేక) శాంతమూర్తిగారు, వాళ్ళావిడ మొన్న రత్నాకరం గారింట్లో పెళ్ళిలో కలిసి, మేమూ మీ ఇంటికి దగ్గర్లోనే వుంటున్నాం ... వస్తూ వుండండి ... సాయంకాలాలు మేం యింటి దగ్గరే వుంటాం ... అని ఎంతో ఆప్యాయంగా పిలిచారు ... ఏం చక్కని జంట ! మనం ఎట్లాగూ ఒంటరివాళ్ళం ! ... బ్రహ్మచారిగాడికి కావలసిందేమిటి ? కడుపునిండా తిండి ... తిన్న తరువాత తాను చెప్పే కథలకు మంచి శ్రోత ... ఓహ్ ! మృష్టాన్న భోజనమే కదూ ! ... వీళ్ళని చూడగానే అనుకున్నాను ... గృహస్థులంటే యిలా వుండాలి ... అని ... రాజారావు, వెంకటరత్నం వాళ్ళలా కాదు ... వాళ్ళు నాలుగు రోజులు వాళ్ళింటికి వెళ్ళానో లేదో ఏదో సాకుతో తప్పించుకునేవాళ్ళు. రెండు రోజులకొకసారి యీ జంట కోరికను మన్నించి సాయంకాలాల పూట యిక్కడకు వచ్చి Tiffin, Coffee సేవించి, కాదు కూడదంటే భోజనం ... తరువాత మెల్లగా కాస్త దగ్గరయ్యాక చేబదులు, తరువాత అబ్బా ! ... తలుచుకుంటూ వుంటే భవిష్యత్తు ఎంత భేషుగ్గా కనిపిస్తుందండీ ! ఇహ జీవితమంతా ఇట్లాగే హాయిగా వీళ్ళని మంచి చేసుకుని !

చెవులయ్య : (లోపలి నుంచి వస్తూ) ఎవరది ? ... ఎవరు కావాలండీ ?

సన్యాసయ్య : ఇది దూర్వాసుల శాంతమూర్తి గారి ఇల్లేనా అండీ ?

చెవులయ్య : ఆయన ఎంత శాంతమూర్తి అయితే మాత్రం అమాంతం అట్లా లోపలికి తరుముకుంటూ రావడమే నటండీ ?

సన్యాసయ్య : వాకిట్లో నుంచి పిలిచాను ... వస్తున్నా ... అంటేనూ ...

చెవులయ్య : "వస్తున్నా" అన్నాను గాని ... మిమ్మల్నే "రండి" అనలేదు కదా ! సరే, మీరొచ్చారు ... ఇక వచ్చిన పని చెప్పండి ...

సన్యాసయ్య : ఇంతకీ మీరు ...

చెవులయ్య : శాంతమూర్తిగారి ఆంతరంగిక ...

సన్యాసయ్య : స్నేహితులా ? ... నమస్కారం ...

చెవులయ్య : అంతటి వాణ్ణేననుకోండి ... ఆంతరంగిక సేవకుణ్ణి ... ఇంతకీ మీరు ... ?

సన్యాసయ్య : శాంతమూర్తి గారిని, వారి శ్రీమతి ... మధురం గారిని ...

చెవులయ్య : కాదు ... అతి మధురం ...

సన్యాసయ్య : ఆ ! అవునవును ... వారిద్దర్నీ చూద్దామని ...

చెవులయ్య : జరూరు పని ఏమైనా ... ?

సన్యాసయ్య : అబ్బే ! అటువంటిదేమీలేదండీ ! నేను కేవలం ...

చెవులయ్య : సిఫారుసు గట్రా !

సన్యాసయ్య : ఛ ! ఛ ! ఒంఠికొమ్ము సొంఠికాయగాణ్ణి ... నాకు సిఫారుసు బెడదేముంటుంది.

చెవులయ్య : పోనీ ... చందాలేమన్నా వసూలు చేస్తున్నారా ? ఇళ్ళు తగలబడిపోవడం ... వరదలకి ఇళ్ళు కూలిపోవడం.

సన్యాసయ్య : అబ్బెబ్బెబ్బే ! ... అటువంటి అకృత్యాలు చేసే వాడిలా కనిపిస్తున్నానా ? నేను కేవలం వారి స్నేహితుణ్ణి ...

చెవులయ్య : అమ్మగారికా ? అయ్యగారికా ?

సన్యాసయ్య : ఇద్దరికీ అనుకోండి ...

చెవులయ్య : తమ పేరు సెలవిచ్చారు కాదు ...

సన్యాసయ్య : మీరు అడిగారు కాదు ... నా పేరు సన్యాసయ్య ...

చెవులయ్య : బావుంది.

సన్యాసయ్య : ఏమిటి ? నా పేరా ?

చెవులయ్య : మీ పేరుకేమండీ ? బ్రహ్మాండంగా వుంది ... నాకు ఇంతకన్నా మంచి పేరున్న వాళ్ళు చాలా మంది తెలుసు ...

సన్యాసయ్య : అట్లాగా !

చెవులయ్య : ఆ ! ఆ మేనమామ వేలువిడిచిన బావమరిది కొడుకుండే వాడండీ !

సన్యాసయ్య : ఇప్పుడు లేడా ?

చెవులయ్య : అహ ! సన్యాసుల్లో కలిసిపోయాడు ... వాడి పేరు కొరివిగాడు ... అబద్ధాల కొరివిగాడు ... ఇంకొకడున్నాడండీ ... తట్టా చవటయ్య ... అని ...

సన్యాసయ్య : నాయనా ! పేర్ల చిఠా ఆవర్జాలు తెరవకు ... శాంతమూర్తి గారు లోపల ఉన్నారా ?

చెవులయ్య : ఉంటే ?

సన్యాసయ్య : నేనొచ్చానని చెప్పు ...

చెవులయ్య : తమ పేరు ... ?

సన్యాసయ్య : చెప్పానుగదయ్యా ! అవాక్కుల సన్యాసయ్య అని ! ఊరికే తికమక పెట్టేస్తావేమ్ ! మనకి కొంచెం ప్రథమ ... తత్తరపాటు ...

చెవులయ్య : అదేమిటండీ ప్రథమ కోపం లాగా ?

సన్యాసయ్య : అదేనయ్యా ! కొత్త మనుషుల్ని కలిస్తే ముందు కాస్త తత్తరపాటు !

చెవులయ్య : ఆ తరువాత ?

సన్యాసయ్య : ఆ తరువాత చూశావ్, మన తడాఖా ! దేన్ని గురించైనా గంటల సేపు ఏకబిగిన Lecture ఇచ్చెయ్యగలను !

చెవులయ్య : (ఆశ్చర్యంగా) అబ్బా ! ... చూడండి సన్యాసిగారు ! మా వాడొకడుండే

RASARANJANI THEATRE LIBRARY RADHA KRISHNA COLLECTION

వాడండీ !

సన్యాసయ్య : నాయనా ! చచ్చి నీ కడుపున పుడతాను !

చెవులయ్య : ఏమిటి ? నా కడుపునా ?

సన్యాసయ్య : పోనీ మీ ఆవిడ కడుపున -

చెవులయ్య : నాకింకా పెళ్ళే కాలేదండి ...

సన్యాసయ్య : అట్లా చెప్పు ... అందుకే నిన్ను చూడగానే పాత స్నేహితుణ్ణి చూసినట్టుగా ఉంది ... ఇంతకీ - నీ పేరేమిటోయ్ ?

చెవులయ్య : చెవులయ్య ... నక్కా చెవులయ్య -

సన్యాసయ్య : ఆహా ! మంచి పేరేనోయ్ !

చెవులయ్య : ఆ పేరుకు ఓ పెద్ద కథ ఉందిలెండి ... అసలేం జరిగిందంటేనండి -

సన్యాసయ్య : (గడ్డం పుచ్చుకుని బతిమిలాడుతూ) నాయనా ! ... నేను శాంతమూర్తి గారిని చూడ్డానికి వచ్చాను ... ఆయన వుంటే - నువ్వు పిలిస్తే -

చెవులయ్య : అంతేనా ? మీరు కాసింత ఓపిక పట్టండి ... నేను అయ్యగారితో చెప్పొస్తాను!

సన్యాసయ్య : మా పెద్దలు తరించారు -

చెవులయ్య : అయ్యా ! సన్నాసిగారూ ...

సన్యాసయ్య : సన్నాసి కాదయ్యా ! ... సన్యాసి ... సన్యాసయ్య ...

చెవులయ్య : (అమాయకంగా) ఏటండీ ! ఆ రెండూ ఒకటి గాదా అండీ ?

సన్యాసయ్య : ఒకటేనయ్యా చెవులయ్యా ! ... సన్నాసినే ! ... లేకపోతే ఎందుకొస్తాను ? ఇహనైనా మీ అయ్యగారికి చెప్పొస్తావా, లేదా ?

చెవులయ్య : మీరు కోపం చేసుకుంటే చెప్పలేను గానండీ ...

సన్యాసయ్య : కోపమెందుకు చెవులయ్యా ... చెప్పు ...

చెవులయ్య : మీరు చాలా మంచోళ్ళలా కనిపిస్తున్నారండీ !

సన్యాసయ్య : అరె ! ఆ విషయం నీకెల్లా తెలుసు ?

చెవులయ్య : అదేటండీ ... చూడంగానే నాకు ఎడం కన్ను అదిరిందనుకోండి ... ఆళ్ళు మంచాళ్ళుగాదండి !

సన్యాసయ్య : మరి ?

చెవులయ్య : కుడి కన్ను అదిరిందనుకోండి ... ఆళ్ళు మంచోళ్ళన్న మాటండి !

సన్యాసయ్య : నువ్వు ఎవర్ని చూసినా ఏదో కన్ను అదురుతూ వుంటుందన్న మాట !

చెవులయ్య : అబ్బే, లేదండీ ! ఏ కన్ను అదరలేదనుకోండి ... ఆడేవడో సత్తరకాయ బాపతండి !

సన్యాసయ్య : మరి నన్ను చూడగానే ఏ కన్ను అదిరిందండి ?

చెవులయ్య : భలే వోరండీ ... కుడి కన్నే అదిరింది ... అందుకే మీరు మంచోళ్ళనండీ !

సన్యాసయ్య : రక్షించావ్ ... చూడు చెవులయ్యా ! ఇప్పుడు మనం ఇద్దరం మంచి స్నేహితులం అయ్యాం కనక –

చెవులయ్య : స్నేహితులం –

సన్యాసయ్య : ఆ ... స్నేహితులం అయ్యాం కనక ...

చెవులయ్య : చిత్తం -

సన్యాసయ్య : నువ్వు నేనడిగే ప్రశ్నలకి సూటిగా జవాబులు చెప్పాలోయ్ ... నీ కష్టం ఉంచుకోన్లే నేను -

చెవులయ్య : చిత్తం ...

సన్యాసయ్య : నిజం చెప్పాలి సుమా ! అబద్ధం చెప్పావో .. నా చిటికెన వేలుక్కూడా తెలుస్తుంది !

చెవులయ్య : అట్లాగాండీ !

సన్యాసయ్య : మరేమనుకుంటున్నావ్ ! ... దేశదేశాలు తిరిగినవాణ్ణి ! ... నువ్వు నిజం చెప్పావనుకో - నీకు మంచి బహుమానం కూడా ఇస్తాను - పది రూపాయలిస్తాను -

చెవులయ్య : అమ్మో ! చాలా ఎక్కువండి ...

సన్యాసయ్య : ఎక్కువో తక్కువో నాకు వదిలేసేయ్ ... నువు దాన్ని గురించి ఆలోచించకు ...

చెవులయ్య : అయితే, అడిగేసెయ్యండి -

సన్యాసయ్య : మాట వరసకే సుమా ... మీ అయ్యగారు - అమ్మగారు మంచివాళ్ళు గదూ ?

చెవులయ్య : ఆ మాటేరేసెప్పాలేటండీ ?

సన్యాసయ్య : నేననుకున్నానులే ! ... వాళ్ళు చాలా కలుపుగోలు మనుషులు గదూ !

చెవులయ్య : అయ్యో ! ఆ మాట ఏరే సెప్పాలేటండీ ?

సన్యాసయ్య : సాయంకాలాలు ఇంటి పట్టున వుండి స్నేహితులతోను, తెలిసిన వాళ్ళతోను కాలక్షేపం చేసే మనుషులు గదూ !

చెవులయ్య : అబ్బో ! అబ్బో ! అంతా సూసినట్టు సెప్పేస్తున్నారండీ ! ... మీ మాటకి ఏరే సెప్పాలేటండీ ?

సన్యాసయ్య : (నవ్వి) ఆ ! ... వాళ్ళిద్దరూ అన్యోన్యంగా - చిలకా గోరింకల్లా -

చెవులయ్య : (ఆశ్చర్యంగా) అయ్యె బాబోయ్ ! ... ఆ మాట ఏరే సెప్పాలేటండీ? ఇద్దరూ ఒకళ్ళనొకళ్ళు అట్టా కలిమిడి అయ్యే మనుషులనుకోండి ... కుడి చెయ్యి చేసే పని ఎడమ చెయ్యికి తెలియదండి ... ఎడమ చెయ్యి చేసే పని కుడి చెయ్యికి తెలియదండీ ! ... సరేనాండీ ! అయినా రెండూ ఒకే పని ఒకే పద్ధతిలో చేస్తాయండి ... అటువంటి వోళ్ళండి మా అయ్యగారూ, అమ్మగారూ !

సన్యాసయ్య : ఇపుడు పూర్తిగా నచ్చావోయ్ నాకు ... వాళ్ళని చూసిన దగ్గర్నుంచీ వాళ్ళు ఇటువంటి వాళ్ళనని నేను పసిగట్టాననుకో! ... అయినా నువ్వే మనుకుంటావోనని - ఇదుగో నీకు నేనిస్తానన్న పారితోషికం !

చెవులయ్య : అబ్బో ... పది రూపాయలిస్తున్నారు ... తరువాత ఎందుకిచ్చానా అని అనుకోరు గందా ?

సన్యాసయ్య : ఛ ! అట్లా అనుకుంటానుటోయ్ ... అందులోనూ నీ విషయంలో !

చెవులయ్య : అయితే అయ్యగారికి చెప్పొస్తానండి -

సన్యాసయ్య : అయ్యగారికి, అమ్మగారికి కూడానోయ్ ...

చెవులయ్య : చిత్తమండి ...

(అని వెడుతూ, వెనకదాకా వెళ్ళి ఆగి సన్యాసయ్య మాటలు వింటూ నిలబడ్డాడు ...)

సన్యాసయ్య : ఆహా ! ఏమీ నా భాగ్యమూ ... పది రూపాయలు పోతేయేం ? లక్ష రూపాయల ఆసరా దొరికింది ! ఇహ సాయంకాలాలు ఎవరింటికెళ్ళి కాసేపు కూర్చుని ఊరికే Tiffin, Coffee లు కానిద్దామా అనే ఆలోచన అక్కర్లేదు కదా ! ... Coffee తాగడానికి కానీ ఖర్చుండదు ... తాగే శ్రమ తప్ప ! ఇంటి పట్టున ఉండి కుర్చీలో చేరగిలబడి కునుకు తీయడానికి ఇదివరకు ఏ హొటలో ఆశ్రయించేవాణ్ణి ... భోజనం ఎక్కడా అని దిగులక్కరలేదు ... పెట్టె లాంటి ఇల్లు ... బంగారం లాంటి జంట ! ... అతిథి అన్నవాడికి ఇంతకన్నా ఏం కావాలి ? ఆహా ! ... ఏమీ నా భాగ్యమూ ... నా జీవితంలో యింతటి శుభదినం రాలేదు కదా ! చీకూచింతా లేకుండా, పదిమందికి చేబదుళ్ళు అడగకుండా వీళ్ళని మంచి చేసుకుని ...

(అంటూ వెనక్కు తిరిగాడు ... చెవులయ్య అక్కడే ఉన్నాడు ... ఈ పై సంభాషణ జరుగుతున్నంత సేపూ ... "నీ పని ఇట్టా వుందా ! అవురా ! ఇంత స్వార్థమా ? నీ పని చెబుతానాగు ! ఆ చెవులు తెగ్గోస్తా - నీ కాళ్ళు విరగ్గొడతా ... నీ ముక్కు పీకేస్తా ..." అన్నట్టు సంజ్ఞలు చేస్తూ వుంటాడు చెవులయ్య ...)

సన్యాసయ్య : చూడు, నాయనా ! ... ఈ జీవితం ఉందే ... బుద్బుదప్రాయం కదా ! ... దీని దుంపతెగ ! ... కోరికలంటే ఏమిటి ? సత్సంగత్వే నిస్సంగత్వం ... నిస్సంగత్వే ... నిస్సంగత్వే - అదే ! అట్లా అన్నారు మన పెద్దవాళ్ళు ... దేనికీ ఆశపడకురా, జీవా! ... ఆశపడితే - నిరాశే నీకు లభిస్తుందిరా మూఢా - అని చెప్పారు మన వేదాంతులు !

చెవులయ్య : (ఒక్కసారిగా, కలవర పడ్డట్టు) అయ్యో ... అయ్యో ... నా మతి మండిపోను ...

సన్యాసయ్య : ఏమయిందోయ్ ... ఏమయింది ?

చెవులయ్య : నల్లా వదిలిపెట్టినట్టున్నాను ... ఊరికే కారిపోతున్నట్టున్నాయి నీళ్ళు ... కట్టేసి వస్తాను ... అట్లాగే అయ్యగారికి చెబుతా – మీరొచ్చినట్టు -

సన్యాసయ్య : (తనలో) భాళా సన్నాసి ! ... మంచివాడు ... కాని (తల చూపుతూ) ఇది శూన్యం ... కాని మంచి హుషారైన వాడు ... ఫరవాలేదు ... మంచి చేసుకుంటే ఉపయోగపడతాడు ... ఈ ఇల్లు కూడా పొందికగా, చక్కగా ఉంది ... ఇంట్లో ఉన్నవాళ్ళు పరమ సాత్త్వికుల్లా కనిపించారు ... కుర్చీలు గట్రా బాగానే ఉన్నాయి గానీ కాస్త పాత సరుకు ... (ఓ కుర్చీలో చేరగిలబడి) ఓరి సన్నాసీ ! అదృష్టం అట్లా కలిసి రావాలిరా ! ... వెతుకుతున్న తీగే కాలికి తగిలింది ఫో !

(లోపల నుంచి శబ్దం ... శాంతమూర్తి, అతిమధురం ... భార్యాభర్తలు

వచ్చారు)

సన్యాసయ్య : (ఆప్యాయంగా) శాంతయ్యగారూ ! మధురమ్మగారూ ! నమస్కారాలు ...

శాంతమూర్తి : అరే ! మీరా సన్యాసయ్యగారూ ! ఎంత శుభ దినం !

అతిమధురం : రండి ... రండి ... చాలా సంతోషం –

శాంతమూర్తి : చూశావా ! మొన్న చెప్పాం ... ఇవ్వాళ వచ్చేశారు !

అతిమధురం : సరిగ్గా సమయానికొచ్చారు -

సన్యాసయ్య : (సంతోషంగా) చెప్పరూ ? ఏమిటి విశేషం ?

అతిమధురం : ఏమీలేదు ... మేం ప్రశాంతంగా ఇంటి దగ్గర ఉన్నప్పుడు వచ్చారూ - అని !

సన్యాసయ్య : చాలా సంతోషం !

అతిమధురం : చూడండి సన్యాసయ్యగారూ -

సన్యాసయ్య : అమ్మా !

శాంతమూర్తి : (అతని ఎడం చేతిని లాగుతూ) క్షమించాలి ... నేను ముందు -

అతిమధురం : (అతని కుడి చేతిని లాగుతూ) కాదు ... నేను ముందు -

శాంతమూర్తి : నేను ముందు వచ్చాను ... ముందుగ వచ్చితిన్ ...

అతిమధురం : నేను ముందు చూశాను ... మును ముందుగా నర్జును నేను చూచితిన్ -

సన్యాసయ్య : అహోహ్ ! ముందుగ వచ్చితీవు, మును ముందుగ నర్జును నేను చూచితిన్ - అన్నట్టుగా వుంది - మీ పోటీ ! ఆహ్ ! ఏం ఆలుమగలండీ !

అతిమధురం : మీరాయన మాటలు వినకండి ... ఆయన ఇహ చాట భారతం విప్పుతారు ...

శాంతమూర్తి : నేను ! చాట భారతం ! నువ్వు జల్లెడ రామాయణం విప్పుతావ్ ! ఇహ ఏక ప్రవాహమే ! ...

అతిమధురం : ఒట్టి చెత్త మాట్లాడేది నువ్వే !

శాంతమూర్తి : చెత్తా ?

అతిమధురం : ఆహ్ ! పరమ చెత్త !

శాంతమూర్తి : దేవుడు నీకు కాస్తంత బుర్ర యివ్వలేదు గాని, బానెడు నోరిచ్చాడు ...

అతిమధురం : నీకు బుర్ర లేదు ; నోరూ లేదు ... ఒట్టి మట్టి బుర్ర -

శాంతమూర్తి : నన్నేమన్నావ్ ?

అతిమధురం : మట్టి బుర్ర అన్నాను ...

శాంతమూర్తి : అంటావ్, అంటావ్ ... పెద్దమనిషి ఉన్నాడని విర్రవీగుతున్నావ్ ... ముందు ఆ చెయ్యి వదిలి పెడతావా, పెట్టవా ?

అతిమధురం : నువ్వే వదిలి పెట్టు -

శాంతమూర్తి : వదిలి పెట్టు అన్నాను !

అతిమధురం : నువ్వే వదులు అన్నాను !

సన్యాసయ్య : (అటూ ఇటూ లాగడం వల్ల గూడ నెప్పి పుట్టి బాధతో) ఓ !

అతిమధురం : విన్నావా ! పాపం ఆయన్ని అరిచేటట్టు చేస్తున్నావు !

సన్యాసయ్య : అయ్యా ! అమ్మా ! మీరేదో చాలా పని తొందరలో ఉన్నట్టు కనిపిస్తుంది ... మరోసారి తమ దర్శనం చేసుకుంటాను !

శాంతమూర్తి : అబ్బే ... బొత్తిగా పని లేదండి !

అతిమధురం : ఉంటే మాత్రం ! మీకన్నా ఎక్కువా ?

శాంతమూర్తి : అందుకే - మీరు వెళ్ళనక్కరలేదు - (ప్రక్క నుంచి ఓ కుర్చీ తెచ్చివేసి) కూర్చోండి !

సన్యాసయ్య : ఎందుకండీ మీకీ శ్రమ ?

అతిమధురం : (మరో కుర్చీ తెచ్చి వేసి) మీరు వెళ్ళనే వెళ్ళొద్దు ... కూర్చోండి ...

(అని తాను తెచ్చిన కుర్చీ చూపిస్తుంది)

సన్యాసయ్య : అట్లాగే ...

శాంతమూర్తి : అందులో కాదు ఇందులో -

సన్యాసయ్య : అయ్యా -

అతిమధురం : ఇందులో -

సన్యాసయ్య : అమ్మా -

శాంతమూర్తి : కాదు ... ఇందులో -

సన్యాసయ్య : అయ్యా ! మీ యిద్దరికీ శ్రమ వద్దు ... నిలబడే వుంటాను ...

శాంతమూర్తి : కూర్చోండి ... ఇందులో, ఎంతసేపు ఇట్లా ? పాపం సన్యాసయ్యగారికి కాస్త మనశ్శాంతి కూడా లేకుండా చేస్తున్నావ్ ...

అతిమధురం : కూర్చోండి ...

సన్యాసయ్య : సరే, సరే ! మీ సంతోషం కోసం అట్లాగే కూర్చుంటాను !

అతిమధురం : (సన్యాసయ్య కూర్చునే సమయానికి అతని కిందికి తాను తెచ్చిన కుర్చీ లాగుతుంది) ఇక్కడ కూర్చోండి -

సన్యాసయ్య : (ఆమె వంక చూచి, చిరునవ్వుతో) పోనీ అట్లాగే

(అని దాన్లో కూర్చోబోతాడు)

శాంతమూర్తి : (గబగబా అటువెళ్ళి) అందులో కాదు ; నా మాట వినండి –

(ఒక వైపు అతి మధురం సన్యాసయ్య భుజాలు పట్టుకుని కూర్చో బెడుతుంది ... శాంతమూర్తి సన్యాసయ్య కూర్చోబోతున్న కుర్చీని ఇవతలికి లాగుతాడు ... సన్యాసయ్య "ఢాం !" అని కిందపడతాడు)

సన్యాసయ్య : అయ్యో ! అయ్యో !

అతిమధురం : చూశావా దద్దమ్మా ! ఏం చేశావో ?

శాంతమూర్తి : నేనేనా ? నువ్వు మాత్రం కారణం కాదు ? సన్యాసయ్యగారికి యిష్టం లేని కుర్చీలో నువ్వే కుదేశావు ... మొహం పగిలుంటే ఏం చేసేదానివి ? అన్నీ యింతే ! దద్దమ్మ అని ... దద్దమ్మ - (సన్యాసయ్యతో) సన్యాసయ్యగారూ ! దెబ్బలు బాగా తగలలేదు కదా !

| | |
|---|---|
| సన్యాసయ్య : | (ఏడుపు గొంతుతో) దెబ్బలు తగలక ఛస్తాయటయ్యా ! నడుం విరగలేదు ! |
| శాంతమూర్తి : | (ఆనందంగా) ఆ మాట అన్నారు ... చాలా సంతోషం ! ఇంకా కొంచెం అట్లా కిటికీ దగ్గరికి రండి ... కాస్త గాలి బాగా వస్తుంది ! |
| సన్యాసయ్య : | (తనలో) ఇక్కడికి రాకుండా వుంటే ఎంత బాగుండేది ! |
| అతిమధురం : | ఇదుగో ఈ కుర్చీ పీట కాళ్ళ కింద వేసుకోండి ... పాపం ! కొంచెం నొప్పులు తగ్గుతాయి - |
| సన్యాసయ్య : | అక్కర్లేదండి – |
| అతిమధురం : | (ఆయన కాళ్ళ కింద వేస్తూ) కాళ్ళు పెట్టుకోండి - |
| సన్యాసయ్య : | అబ్బే, వద్దండి ... |
| శాంతమూర్తి : | (Sofa లో ఉన్న దిండు తీసుకువచ్చి) ఇది కూడా వేసుకోండి ... మెత్తగా ఉంటుంది! |
| సన్యాసయ్య : | అయ్యో వద్దండి ... |
| అతిమధురం : | ఇది వేసుకోండి ... ఇంకా మెత్తగా ఉంటుంది ... (దిండు తెచ్చి వేస్తుంది) |
| సన్యాసయ్య : | వద్దు బాబూ వద్దు ... |
| శాంతమూర్తి : | ఇది – (అని మరో దిండు తెచ్చి వేస్తాడు) |
| అతిమధురం : | (ఇట్లా ఉందా నీ పని అనుకొని ఒక చిన్న కుర్చీ పీట తెచ్చి) అది వేసుకోండి ... |
| సన్యాసయ్య : | ఇంకోటా ? (ఇప్పుడు మొహం కూడా కనిపించకుండా సన్యాసయ్య పూర్తిగా మునిగిపోతాడు) |
| శాంతమూర్తి : | నేను చేసిన ప్రతీదానికీ ఎడ్డెం అంటే తెడ్డెం అంటావు కదూ ? (అని మధురం వేసిన మొదటి కుర్చీ పీటను ఒక్క తన్ను తన్నుతాడు ... పీట, దిళ్ళూ వాటి మీద పీట - అన్నీ కింద పడతాయి ... వాటి మీద సన్యాసయ్య పడిపోతాడు) |
| సన్యాసయ్య : | (కాళ్ళు చేతులు పైకెత్తి పడిపోతాడు) బాబోయ్ ! ... |
| శాంతమూర్తి : | ఏమిటి ప్రతి దానికీ - ఊరికే అట్లా పడిపోతున్నారు ... బొత్తిగా కుదురు లేదండీ మీకు సన్యాసయ్యగారూ ! |
| అతిమధురం : | (పడ్డవాడిని లేపుతూ) నువ్వు ... నువ్వు ఆయన అంతు చూడకుండా వదిలేట్టు లేవు ! |
| సన్యాసయ్య : | (కొంచెం అధికారంతో) ఇద్దరూ కాసేపు వూరుకుంటారా ? |
| అతిమధురం : | నాకిష్టమైతే ఊరుకుంటాను ; నా ఇష్టం - |
| శాంతమూర్తి : | నీకిష్టమైతేనా ? |
| అతిమధురం : | ఆహా ! |

| | |
|---|---|
| శాంతమూర్తి : | (కోపంతో పళ్ళు బిగిస్తూ) ఓ ! అంతేనా ? |
| అతిమధురం : | నాకిప్పుడు యిష్టం లేదు ; కనుక నేను ఊరుకోను ! |
| శాంతమూర్తి : | ఊరుకోకపోతే ఉరేసుకో ! |
| అతిమధురం : | నేనేం చవటని కాదు - |
| శాంతమూర్తి : | అదుగో ! మాటలు మీరుతున్నావు ! నేను చవటను కాదు అని నువ్వు అంటుంటే నేను చవటననా నీ ఉద్దేశ్యం ? |
| అతిమధురం : | ఏం ? నువ్వే ఎందుకు కావాలి ? ... ఈ సన్యాసయ్యగారు కాకూడదా ? |
| సన్యాసయ్య : | నిజమేనమ్మా ! నేను చవటనే ! |
| శాంతమూర్తి : | మీరూరుకోండి సన్యాసయ్యగారూ ! అయితే మాత్రం ? |
| అతిమధురం : | ఇహ అనవసరంగా మాట్లాడకు - వాగుడుకాయి ! |
| శాంతమూర్తి : | నువ్వే వూరుకో - Factory గొట్టంలా ఒకటే లొడలొడ - |
| అతిమధురం : | నువ్వు లేవు ? చిమ్నీ గొట్టం ! Rail Engine గొట్టం ... గొట్టం ... గొట్టం ... గొట్టం ! |
| శాంతమూర్తి : | (Serious గా సన్యాసయ్యతో) ఏం జీవితమండీ ఇది ? |
| అతిమధురం : | చాడీలు చెప్పు ... ఊ ... కానీ ... పనీ పాటా లేకుండా పొద్దస్తమానం ఇంటి దగ్గరుండి పెళ్ళాం ఆస్తి అరిగిపోయేలా తిని కూర్చోడం కాదు ... పాపం ! మా నాన్న చెమటోడ్చి సంపాదించిన ఆస్తి - |
| శాంతమూర్తి : | ఏమిటి ! మీ నాన్న - చెమటోడ్చి ... దేశంలో ఉన్న సగం మంది జనం పొట్టలు కొట్టే కదూ - మీ నాన్న సంపాదించింది ! |
| అతిమధురం : | ఆ ! మీ నాన్న సంపాదించారుగా ! చేసిన అప్పులు తీర్చలేక అప్పులాళ్ళు ఇంటి మీద పడితే దొడ్డిదోవన పారిపోయిన మీ నాన్న సంగతే చెప్పుకోవాలి ! |
| శాంతమూర్తి : | (సన్యాసయ్యతో) వింటున్నారుగా ! |
| సన్యాసయ్య : | (చాలా నిరాకారుడుగా) ఏమిటో ! దేశం అంతా కాలంగాని కాలంలో ఒక్కసారి చల్లబడిపోయిందండీ ! |
| శాంతమూర్తి : | (భార్యతో) నీ అసలు రంగు బయట పెట్టేటట్లు చేస్తున్నావ్, జాగ్రత్త ! |
| అతిమధురం : | నా ... అసలు ... సంగతి ... చెప్పు ... ఎంత దమ్ములున్నాయో చూస్తాను - |
| శాంతమూర్తి : | నిన్ను ఎటువంటి పరిస్థితుల్లో చూసి, జాలిపడి, కాపాడి, పెళ్ళి చేసుకున్నానో చెబితే - |
| అతిమధురం : | ఆ ! చేసుకున్నావులే మా లావు పెళ్ళి ! |
| శాంతమూర్తి : | కాక ? నేను చేసుకోకపోతే జన్మకి పెళ్ళయేది కాదు - ఎక్కడో బజార్లో - |
| అతిమధురం : | ఇహ మాట్లాడావా ... చూసుకో - |
| శాంతమూర్తి : | (కాలు తట్టి) ఏం చేస్తావ్ ? |
| సన్యాసయ్య : | (రాజీ కోసం తాపత్రయపడిపోతూ) అంత ఆవేశపడిపోకండి ... మధురం గారు చెప్పింది కొంచెం సబబుగానే ఉన్నట్లు తోస్తోంది ... |
| శాంతమూర్తి : | సబబు ? |

సన్యాసయ్య : (చిరునవ్వుతో తల పంకిస్తూ) అవును !

శాంతమూర్తి : సబబు ?

సన్యాసయ్య : అంటే –

శాంతమూర్తి : సబబు ... నాల్రోజులపాటు ఈ లోకంలో ఉండాలని లేదా ఏం ?

సన్యాసయ్య : అబ్బే ! అదేం లేదు ... ఊరికే మాటవరసకి - దాన్ని గురించి పట్టించుకోకండి - మరిచిపోండి ...

శాంతమూర్తి : మా రోజుల్లో చచ్చు పుచ్చు మాటలు చాలా విన్నానుగాని, ఇంత అధమస్తపు మాట యీ జన్మలో వినలేదు !

సన్యాసయ్య : క్షమించమన్నానుగా !

శాంతమూర్తి : సబబు !

సన్యాసయ్య : ఒక్క మాట చెప్పనివ్వండి !

శాంతమూర్తి : సబబు !

(అని మత్తెక్కిన మదగజంలా ఊగుతూ వుంటాడు)

సన్యాసయ్య : ఒక్క మాట వినండి !

శాంతమూర్తి : (అటూ ఇటూ పరిగెత్తుతూ) ఏదీ ! ఒక కర్ర ఇట్లా ఇవ్వండి ... కర్ర ... ఇవ్వాళ యీ సన్యాసయ్యగారి నడుం విరగ్గొడతాను ... సహనానికైనా హద్దులుంటాయి ... ఇహ నా వల్ల కాదు ... ఆడదాని ఆకారంలో ఉన్న ఆ పిశాచి, ఆ భూతం, ఆ రక్కసి ... నన్ను ప్రతిక్షణం నరకయాతన పెట్టే మనిషి ... నా శరీరంలో ప్రతి అంగాన్ని కొద్ది కొద్దిగా కాల్చి రగిలిస్తున్న ఆడది చెప్పింది సబబు !

సన్యాసయ్య : అయ్యా ! ఒక్క మనవి -

అతిమధురం : ఆ ! ఆ మాటకేం పట్టించుకోకండి ... అయనకి మతిస్థిమితం తప్పింది !

శాంతమూర్తి : ఆవిడ చెప్పింది సబబు అంటున్న మీరెంత బేసబబు మనుషులో మీకు తెలియటం లేదు - ఇంత మందమతిని నా జీవితంలో చూడలేదు -

సన్యాసయ్య : (వెధవ నవ్వు నవ్వి) నాకూ అట్లానే అనిపిస్తుంది సుమండీ, నన్ను చూసుకూంటే!

శాంతమూర్తి : మీరు నా స్థానంలో ఉంటే మీకు తెలిసేది ... మూడు వందల అరవై రోజులూ నాలుగు గంటలూ వేవుకు తింటూ వుంటే మీకు తెలిసేది ... ఆ వేపుడును కరకరా నములుతూ ఆనందిస్తూ వుంటే మీకు తెలిసేది - ఊరికే సబబు అనగానే సరిగాదు !

అతిమధురం : (సన్యాసయ్యతో) చూశారా, చూశారా ! ఇహ లాభం లేదు ... తీసికెళ్ళి పిచ్చి ఆసుపత్రిలో పడేస్తేగాని యీ మనిషికి బుద్ధిరాదు !

శాంతమూర్తి : పిచ్చాసుపత్రి ! నన్ను ! నా జీవితాన్ని పిచ్చి పట్టించి పీడించుకుతినే పిచ్చిది ఎవరు? చెప్పరేం, ఎవరు ? (సన్యాసయ్య చొక్కా పట్టుకు లాగుతూ) సన్యాసయ్యగారూ ! ఎవరిది పిచ్చి, చెప్పండి ... నేను తాగే నీళ్ళలో మందు కలిపిందెవరు ? నేను తినే అన్నంలో విషం కలపాలని ప్రయత్నించిందెవరు ? చెప్పమనవయ్యా –

(అని లాగే సరికి చొక్కా చినికిపోయింది)

అతిమధురం : నేను ... నేను విషం కలిపానన్న వాళ్ళదే పిచ్చి ! మతిస్థిమితం లేకపోతేనే ఆ పిచ్చి పిచ్చి వాగుడు ... ఏమంటారు సన్యాసయ్యగారూ ! మాట్లాడవేమయ్యా !

(అని చొక్కా రెండో పక్క లాగుతుంది ... అటు పక్క కూడా చినుగుతుంది)

శాంతమూర్తి : చెప్పమనవయ్యా ! - అన్నిట్లో కాస్త కాస్త విషం కలుపుతుందో లేదో -

అతిమధురం : చెప్పవేమయ్యా ! అదంతా అబద్ధమని -

సన్యాసయ్య : అయ్యా - అమ్మ ...

(అంటూ యిద్దర్నీ బతిమాలే ప్రయత్నం చేశారు)

అతిమధురం : అబద్ధమో కాదో - క్షణంలో ... క్షణంలో నిరూపిస్తా -

(అంటూ గబగబా లోపలికి వెళ్ళిపోతుంది)

శాంతమూర్తి : నవ్వు క్షణంలో నిరూపిస్తావ్ ! నువ్వు ఎంత రెండో కేటు ఒకటివో అరక్షణంలో నిరూపిస్తా –

(అంటూ రెండో వైపుకు వెళ్ళిపోతాడు)

సన్యాసయ్య : ఇద్దరు పిచ్చి మనుషుల మధ్య చిక్కుకుపోయాను ! ఏది దారి ? (అటూ ఇటూ చూసి) ఇద్దరూ ఏదో పెద్ద వ్యూహం మీదే వచ్చేటట్టున్నారు ? ... ఈలోగా చప్పుడు చెయ్యకుండా బతుకు జీవుడా అంటూ మనం బయటకు జారుకుంటే - (అంటూ వెళ్ళబోతాడు ... ఎదురుగా చెవులయ్య వస్తాడు)

(ఈ Scene లో అంతా చెవులయ్య సంజ్ఞలతో సంభాషిస్తాడు)

(చెవులయ్య వెడుతున్న వాడిని ఆపి ... "ఎక్కడికి ?" ... అన్నట్టు సంజ్ఞ)

సన్యాసయ్య : ఏమయ్యా ! పెద్దమనిషి ! వీళ్ళు అన్యోన్య దంపతులన్నావే ! వీళ్ళను మించి ఆతిధ్యం ఇచ్చేవాళ్ళు ఈ వూరి మొత్తం మీద లేరన్నావే ! (ఏడుపు మొహంతో) నన్ను యీ ఇంట్లో కెందుకు రానిచ్చావయ్యా ?

(చెవులయ్య ఈ మాటలకి నాలుక జాపి, పళ్ళ కిందికి నొక్కి ఆశ్చర్యార్ధకాలతో అభినయిస్తాడు)

సన్యాసయ్య : నేను చెప్పిన ఒక్క మాట వింటేనా ?

(చెవులయ్య విన లేదా అన్నట్లు చెవులయ్య ప్రశ్న)

సన్యాసయ్య : విని ఏడిస్తే నా యీ అఘోరింపు ఎందుకు ? ఇటు వాళ్ళు అటు వాళ్ళు పడి యీ పళంగా కుళ్ళబొడిచేశారు గదయ్యా !

(చెవులయ్య 'అట్లాగా !' అన్నట్లు ఆశ్చర్యార్ధకంగా పెడతాడు మొహం)

సన్యాసయ్య : పిల్లికి చెలగాటం ... ఎలక్కి ప్రాణ సంకటం ... ఇప్పుడు ఇద్దరూ ఏదో కుట్ర పన్నడం కోసం లోపలికి వెళ్ళారు ... ఈ లోగా ఇక్కడ నుంచి ఉడాయించకపోతే ప్రమాదం ...

(వెళ్ళబోతాడు)

చెవులయ్య : ('తప్పు' అన్నట్టు సంజ్ఞ ... వెళ్ళిపోతే తన గొంతు కోస్తారనే సంజ్ఞ)

సన్యాసయ్య : నాయనా ! వెడితే నీ అంతు చూస్తారు ... ఉంటే నా అంతు చూస్తారు ! ఏది

దారి ?

(అని వెళ్ళడానికి బతిమాలుతాడు ... సన్యాసయ్య చెవులయ్యకి వెనక Side Wing దాకా నెట్టుకుంటూ పోవడం, చెవులయ్య తప్పు, వాళ్ళు వస్తారు అని చెబుతూ తిరిగి వెనక్కి నెట్టుకుంటూ రావడం జరుగుతుంది)

సన్యాసయ్య : నన్ను పోనీవయ్యా ! నీకు పుణ్యం ఉంటుంది ...

(చెవులయ్య తప్పు అని సంజ్ఞ)

సన్యాసయ్య : నేను వెళ్ళకపోతే - ఇహ నీకు దక్కనయ్యా -

(చెవులయ్య 'అంతే గదా' అని సంజ్ఞ)

సన్యాసయ్య : (ఇహ హతాశుడై) పోనీ ఒక పని చేసిపెడతావా ?

(చెవులయ్య 'అడగండి - దానికేం భాగ్యం ?' అన్న సంజ్ఞ)

సన్యాసయ్య : నాకిక్కడ శారీరక, మానసిక రుగ్మతలేమన్నా సంభవిస్తే - కాస్త ఆసుపత్రికి జేరేయ్ నాయనా - చచ్చి నీ కడుపున పుడతాను ...

(చవులయ్య 'ఎంతమాట ! తప్పకుండా చేస్తాను' అన్న సంజ్ఞ)

సన్యాసయ్య : (కోపమొచ్చి) కాస్త ఆ ఆంగికం ఆపి వాచకం తగలడనియ్యవయ్యా ! ప్రాణాలు కడబట్టి నేను ఏడుస్తుంటే - నీకిదంతా ఆటగా వుంది !

(చవులయ్య 'తప్పు - తప్పు' అని సంజ్ఞ)

(ఇంతలో లోపలి నుంచి 'సన్యాసయ్యగారూ !' అని పిలుపు ... చెవులయ్య - అడుగో - మా అయ్యగారు వస్తున్నారు - అని చూపులతో చెబుతూ వెళ్ళిపోయాడు)

శాంతమూర్తి : సన్యాసయ్యగారూ ! మీరు నన్ను క్షమించాలి ... మీరు వచ్చి ఇంత సేపాయె ! మీకు తగిన మర్యాద చెయ్యలేకపోయాను ... చూశారా !

సన్యాసయ్య : (ఆశ్చర్యం నటిస్తూ) ఎప్పుడూ ? ఛ ! ఛ ! మీరు మర్యాదరామన్నకి మారు పేరు కదండీ ! అట్లా అనుకోండి ... మీ ఇంట్లో నాకు జరిగిన అతిథి మర్యాద - ఎప్పుడూ ఎవ్వరికీ జరిగి వుండదు - ఏం మర్యాద, ఏం మర్యాద! మరి నాకు సెలవు ఇప్పించండి ... వెళ్ళొస్తాను !

శాంతమూర్తి : అప్పుడేనా ?

సన్యాసయ్య : అమ్మో ! చాలా జరూరు పని మరచిపొయొచ్చాను ... క్షమించాలి !

శాంతమూర్తి : నిజంగానా !

సన్యాసయ్య : నిజ్జంగానండి !

శాంతమూర్తి : అమ్మో ! వెళ్ళే ముందు కాసిన మజ్జిగో, ఒక షర్బతో, కనీసం కాసిని మంచినీళ్ళో తాగకుండా వెళ్ళడం కుదరదండీ -

సన్యాసయ్య : అయ్యా ! ఎట్లాగయినా నా మీద దయ ఉంచి కుదిరించుకోండి !

శాంతమూర్తి : కుదరదంటే కుదరదండీ ! ఏదో ఒకటి తాగకుండా ఇక్కడ నుంచి వెళ్ళిపోతానని అనడానికి మీకు మనసెలా ఒప్పిందండీ ! మన భవిష్యత్ స్నేహానికి నాందిగా మీరు ఏదో ఒకటి పుచ్చుకు తీరాలి ... మీరు తీసుకోకపోతే నాకు చాలా బాధగా ఉంటుంది ... నా మీద మీకెందుకో కోపం వచ్చిందనుకోవాల్సి ఉంటుంది నేను ... (దూరంగా ఉన్న చెవులయ్యతో)

చెవులయ్యా ! చక్కగా నిమ్మకాయ షర్బత్ చేసి తీసుకురా !

సన్యాసయ్య : (అయిష్టంగానే) సరే ! కానివ్వండి ...

శాంతమూర్తి : అట్లా అన్నారు బాగుంది !

సన్యాసయ్య : కాని, మీ భార్యభర్తలు మధ్య వుండె కలతల్లో నన్ను లాగనంటేనే పుచ్చుకుంటాను ... నేనేదో పక్షపాతినని మీరో, మీ భార్యామణి గారో అనుకోవచ్చు ... పైగా నా చొక్కా రెండో వైపు రక్షించుకోవలసిన బాధ్యత ఉంది, చూడండి -

శాంతమూర్తి : సరే ! మీరన్నట్లుగానే కానివ్వండి !

సన్యాసయ్య : ఒప్పుకున్నట్టేగా !

(అని చేతిని అందిస్తాడు)

శాంతమూర్తి : (అతని వీపు మీద గట్టిగా చరిచి) ఒప్పుకున్నట్టే -

సన్యాసయ్య : అయితే మనం యిట్లా కూచుందాం ...

(ఇద్దరూ కుర్చీల్లో కూర్చుని ఒకరికేసి ఒకరు చూసుకుంటారు ... మెల్లగా ఒకళ్ళని ఒకళ్ళు చూసి చిరునవ్వు నవ్వుకుంటారు)

శాంతమూర్తి : (ఉత్సహంగా) మనిద్దరం దగ్గరి స్నేహితులం కాబోతున్నామని నాకు తెలిసి పోయిందండీ !

సన్యాసయ్య : నిజమా ! నా ఉద్దేశ్యం కూడా అచ్చంగా అదేనండి !

శాంతమూర్తి : మీరు నేనంటే చాలా స్నేహంగా ఉన్నారు ... (సన్యాసయ్య వినయంగా దణ్ణం పెడతాడు) నేరుగా నేను ఇట్లా అంటున్నానని మీరేమీ అనుకోకూడదు సుమండీ ! అతికి పోయినట్టు ఉండే మీ మాటలు, అందులో ఉండుకున్న నిగూఢమైన అర్ధాలు, సామెతలు వగైరాలు - మామూలు వాళ్ళకి అబ్బేనా ? అయితే - ఒక్క విషయం మాత్రం మీతో చెప్పక తప్పదండీ - మీరేమనుకున్నా సరే !

సన్యాసయ్య : అనుకునేదేముంది ... చెప్పండి !

శాంతమూర్తి : అదే ! ... మీరు నిష్కర్షగా మాట్లాడే పద్ధతి ఉందే ! ముక్కుకు సూటిగా, నిర్మొహమాటంగా ఉండడం మీ ప్రత్యేకత అంటాను నేను ... ఏమంటారు ?

సన్యాసయ్య : (వినయంతోనే, అయినా విజయోత్సాహంతో) ఏదో, మీ మంచితనం -

శాంతమూర్తి : అన్నారా ! మీ మంచితనం మీకు కనిపించదండీ ! మీరు ఇంత నిర్మొహమాటి గనక - నాకొక్క విషయం చెప్పండి ... నాన్చుడాలు, డొంక తిరుగుడు మాటలూ మీకూ నచ్చవ్, నాకూ నచ్చవ్ - అందుకని సూటిగా చెప్పాలి -

సన్యాసయ్య : అడగండి -

శాంతమూర్తి : ప్రపంచంలో - మీరు చూసినంతలో - అకటావికటం, తలపొగరు, అఘాయిత్యం - అన్నీ కలబోసుకున్న మనిషి మా ఆవిడేనని మీరు ఒప్పుకుంటారా, లేదా ?

సన్యాసయ్య : (అతన్ని వారిస్తూ) అదుగో - మీ వ్యక్తిగత విషయం - ఊహూ -

శాంతమూర్తి : నిర్మొహమాటం మనిషినని ఇప్పుడే చెప్పారు –

సన్యాసయ్య : మీరటువంటివి అడగకూడదు, నేను చెప్పకూడదు ...

శాంతమూర్తి : అంతే ... అంటే ... మీరు ఒప్పుకున్నట్టేగా ?

సన్యాసయ్య : అదేమిటండోయ్ ?

శాంతమూర్తి : ఒక్క మొహమేనా ? చేసే పనులు ? ఎంత క్రూరత్వం ? ఎంత పొగరు ? ఇంతెందుకు ; ఒక చిన్న ఉదాహరణ చెబుతాను ...

సన్యాసయ్య : నాకేం చెప్పొద్దు మాహాప్రభో ... ! నా ఉద్దేశ్యంలో -

శాంతమూర్తి : నన్ను చెప్పనివ్వండి ... ఆ తరువాత మీరు ఎంత సేపు ఏం చెప్పినా వింటాను ... పడుకుంటామా ? మంచం చివరిదాకా తోసుకుంటూ పోతుందండీ ? అంతేనా ? రాత్రంతా అటూ ఇటూ తిరుగుతున్నాట్టు నటన ... అటు తిరుగుతూ ఒక తన్ను ... ఇటు తిరిగితూ ఒక తన్ను ...

(అంటూ సన్యాసయ్యని తన్నుతూ వుంటాడు)

సన్యాసయ్య : అయ్యో ! అయ్యో ! అట్లా తంతారేంటండీ ?

శాంతమూర్తి : అంతేనండీ ? ... అఘాయిత్యం కాకపోతే - దిండు పట్టుకుని పైకి జరుగుతున్నట్టు జుట్టు పట్టుకు పైకి పాకుతుందండీ !

(అంటూ జుట్టు పీకుతాడు)

సన్యాసయ్య : అబ్బా ! ...

శాంతమూర్తి : నెప్పి పుట్టిందా ? పుడుతుందండీ ... ప్రతీరాత్రీ ఇదే వరసనుకోండి ... పొద్దున్నే లేస్తుందా ? ఆవులించి ఒళ్ళు విరుచుకుంటున్నట్టు నటించి మొహం మీద ఒక్కటిస్తుందండీ ! (అని ఆవులించి, ఒళ్ళు విరుచుకుని చేత్తో సన్యాసయ్యని కొడతాడు) ఇది ఏమన్నా బావుందంటారా ?

సన్యాసయ్య : బావుందండోయ్ ! ఆవిడ చేసినవన్నీ వ్యాఖ్యాన సహితంగా చేస్తూ నా కాళ్ళూ, చేతులూ, మొహం విరిచేస్తున్నారు ... ఇదేమన్నా సబబుగా వుందా మీకు ? బుద్ధి గడ్డితిని మీ ఇంటికొచ్చాను ఇహ - నన్ను పుతం వేసినా మీ ఇంటికి రాను సరి గదా, దీని చాయల కూడా కనిపించను ...

(అని నమస్కారం చేస్తూండగా అతిమధురం ప్రవేశం ... అతి వేగంగా వచ్చింది ... ఆమె చేతిలో ఒక Glass ... ఆ Glass ను సన్యాసయ్య నోటి దగ్గర పెట్టి)

అతిమధురం : తాగండి ...

సన్యాసయ్య : (అదిరిపడి) అదేమిటి ?

అతిమధురం : తాగండి ...

శాంతమూర్తి : ఏమిటి ? నువ్వింకా బతికే వున్నావా ?

అతిమధురం : నీకేమన్నా అయిందేమో ! నేను నిక్షేపంలా ఉన్నాను ... (సన్యాసయ్య తో) తాగండి ... తాగి అప్పుడు చెప్పండి ...

శాంతమూర్తి : ఏలేశ్వరం వెళ్ళినా శనేశ్వరం తప్పలేదన్నట్టు, హాయిగా, కులాసాగా, ఆనందంగా, సంతోషంగా నేనూ, మన సన్యాసయ్యగారూ మాట్లాడుకుంటుంటే మధ్య నీ అజమాయిషీ ఏమిటీ ? కదులు ...

అతిమధురం : ఛస్తే కదలను ...

శాంతమూర్తి : నువ్వు ఇట్లా ఎందుకు కదులుతావు ? చెప్తా ...

(అని తల పంకించి లోపలికి వెళ్ళిపోతాడు)

అతిమధురం : అమ్మయ్య ! పీడా వదిలిపోయింది ...

(అని శాంతముర్తి వెళ్ళిన Wing దాకా వెళ్ళి కాలు తాటించి వస్తుంది ... ఈలోగా)

సన్యాసయ్య : ఈవిడకి పిచ్చో, ఆయనకు పిచ్చో తెలియటం లేదు ... ఇక్కణ్ణించి క్షేమంగా బయటకు తీసుకుపో తండ్రీ ! ఏడుకొండలవాడా ! నీ కొండకు వచ్చి ...

అతిమధురం : (మళ్ళీ వెనకాలకు వచ్చి) ఇప్పుడు తాగండి ...

సన్యాసయ్య : ఒద్దు ...

అతిమధురం : మొహమాటపడకండి ... మీరు తాగి చూడండి ...

సన్యాసయ్య : వద్దంటున్నాగా ! ... ఇహ నేను వెడతాను ... అవతల జరూరు పని వుంది !

అతిమధురం : అదేమిటి ? అప్పుడే ? అంత అకస్మాత్తుగానా ?

సన్యాసయ్య : ఇంటి దగ్గరే ఓ జరూరు పని జ్ఞాపకం వచ్చింది ... వెళతాను ... వెళ్ళాలి ... వెళ్ళి తీరాలి ...

అతిమధురం : (చాలా Serious గా) సరే ! మీ యిష్టం ... కాని వెళ్ళే ముందు ఒక చిన్న సహాయం చెయ్యగలరా ?

సన్యాసయ్య : అమ్మమ్మ ! ... ఎంతమాట ... ! చెప్పండి ...

అతిమధురం : (Serious గా నే) నన్ను మీతో కూడా తీసుకు వెళ్ళండి !

సన్యాసయ్య : (బిక్కమొహంతో) అదేమిటమ్మా ? ఎట్లా ?

అతిమధురం : ఈ నరకంలోనే ఉండి పొమ్మంటారా ? ... తీసుకుపోండి -

సన్యాసయ్య : అమ్మా ! నన్ను కనికరించి ... నన్ను వెళ్ళిపోనీ -

అతిమధురం : తీసుకుపోరు ... అంతేనా ? నాకేం ? మరోక్షణంలో ఓ అతి దారుణమైన దృశ్యం చూస్తారు ఇక్కడే !

సన్యాసయ్య : (తనకేదో మూడిందని) అమ్మ ! బ్రహ్మచారి ముండావాణ్ణి ! నేరక ఇక్కడికి వచ్చాను ... దయచేసి ... నాకు విముక్తి ప్రసాదించు -

అతిమధురం : అదేం లాభం లేదు ! ... మరో క్షణం మీరు ఇక్కడ జరిగే అతి దారుణమైన దృశ్యానికి కారకులవుతారు - ఆ తరువాత మీ ఇష్టం !

సన్యాసయ్య : నేనా !

అతిమధురం : అక్షరాలా ! మీరు "దేవుడా !" అని మూడు అక్షరాలు చెప్పేలోగా మీ ముందు ఓ శవం పడి వుంటుంది ... రక్తం మడుగులో - శవం ...

సన్యాసయ్య : ఓరి దేవుడా ! ... (అని నాలిక కరుచుకుని) కాదు, కాదు ... అమ్మా ! నేను చేసిన తప్పేమిటి చెప్పండి ... నన్నెందు కిల్లా సావకాశంగా చంపుకు తింటున్నారు ?

అతిమధురం : మీరన్నదే నిజం ... దేన్నీ తెగేదాకా లాగకూడదు ... అవునా ? ... (అని అతని మీది మీదికి పోతూ) మరి పదేళ్ళపాటు ఎట్లా కాపురం చేశావని

అడగరేం ?

సన్యాసయ్య : మీ కాపురం గంగలో కలవా ! నా కెందుకమ్మా మీ కాపురం గొడవ ?

అతిమధురం : అక్కర్లేదులెండి ... మీ కెందుకు ఆ గొడవ ? మీదేం పోయింది ? అట్లాగే అంటారు ... (అని కోపంగా దగ్గరికి వచ్చి) కాళ్ళూ చేతులు కట్టి పడేసి రాత్రిళ్ళు పస్తులు పెడితే తెలుస్తుంది మీకు ! రోజూ రాత్రిళ్ళు ఇంటికి వస్తూనే అయినదానికీ కానిదానికీ చెంపదెబ్బలు తింటే తెలుస్తుంది మీకు ! అవునా ?

సన్యాసయ్య : అమ్మా ! ... తినకుండానే ... తెలుస్తోందమ్మా !

అతిమధురం : (మెల్లమెల్లగా ఆయన మీదకు పోతూ) కొట్టడంలో ఆగుతాట్టండీ ఈయన ! పొట్టలో పొడుస్తాడు ... గిచ్చుతాడండీ ! మామూలుగా అనుకున్నారా ? ఇట్లా చూపుడు వేలు బొటన వేలు పెట్టి ఈ పక్కన గట్టిగా పట్టుకుని చిన్నప్పుడు వీధిబడి Master తొడపాశం పెట్టినట్టు పెడతాడండీ ! ఇట్లా - (అంటూ సన్యాసయ్యను గిచ్చడం మొదలు పెడుతుంది) ఇట్లా ... ఇట్లా ...

(ఆమె అట్లా గిచ్చుతుంటే సన్యాసయ్య తెలుగు భాషలో ఉన్న అన్ని అచ్చులను అరుస్తూ ఉంటాడు ... అ ... ఈ ... ఉ ... అప్పుడు వస్తాడు శాంతమూర్తి చేతిలో మరో Glass పట్టుకుని)

శాంతమూర్తి : (సన్యాసయ్య దగ్గరికి వచ్చి) ఇది తాగి చూడండి -

సన్యాసయ్య : మళ్ళీ ఇదొకటా ? ఇదేమిటి మహాప్రభూ ?

శాంతమూర్తి : విషం ! ... ప్రపంచంలో ఉన్న విష సర్పాలన్నింటి కన్న ప్రమాదకరమైన పాము విషం! ... తాగవయ్యా ! ... అప్పుడు కాని నీ పని తక్కున కుదరదు !

సన్యాసయ్య : అయ్యా ! మీ మాట నమ్ముతాను !

అతిమధురం : (మొగుడితో) నాకు తెలుసు నీ టక్కరి వేషం ! (సన్యాసయ్యతో) తాగండి ...

(అని తాను తెచ్చిన Glass ఇస్తుంది)

సన్యాసయ్య : నాకక్కర్లేదండీ ...

శాంతముర్తి : ఇది తాగండి ...

సన్యాసయ్య : ఇద్దంటుంటే -

అతిమధురం : (శాంతమూర్తి Glass వాసన చూసి) అబ్బా ! వాసనే దుర్భరంగా ఉంది !

శాంతముర్తి : (భార్య Glass చూపిస్తూ) అది వారం రోజుల నాటి గంజి ! నాకు తెలియదూ!

అతిమధురం : నీకేం తెలుసు ? (సన్యాసయ్యతో) ఇది తాగండి !

శాంతమూర్తి : ఊహూ ... ఇది తాగండి ...

సన్యాసయ్య : నాకక్కర్లేదు ... అక్కర్లేదు ... అక్కర్లేదు ...

(పెద్ద అరుపు నుంచి ఏడుపుగాకా)

శాంతమూర్తి : అయ్యా ! ఈన మన అతిథి ... తాగకపోతే తప్పు కాదూ ?

అతిమధురం : అతిథిదేవోభవ అన్నారు ...

(భార్యాభర్తలు ఇద్దరూ ఒకేసారి)

ఇద్దరూ : తాగి తీరాల్సిందేనండి ...

(ఇద్దరూ వాళ్ళువాళ్ళ Glass ల్ని ఆయన నోటి దగ్గరకు తెస్తారు)

సన్యాసయ్య : నాకక్కర్లేదు మహాప్రభో ...

(అని పళ్ళు కరుచుకుంటాడు గట్టిగా)

శాంతమూర్తి : మీరు పళ్ళు కరుచుకుంటే నోరు తెరిపించడం మాకు చేతకాదనా ?

(అని గట్టిగా బుగ్గలు నొక్కుతాడు ... ఆ ... ఆ ... అంటూ ఉంటాడు సన్యాసయ్య)

అతిమధురం : అట్లా పసిపిల్లవాడికి ఆముదం పోసినట్లు పోస్తావ్ ...

శాంతమూర్తి : నువ్వు కోడిపెట్టకి వడ్లగింజలు తినిపించినట్లు తినిపిస్తున్నావ్ !

అతిమధురం : నువ్వు గేదెకి గడ్డి పెట్టినట్లు పెడుతున్నావ్ !

శాంతమూర్తి : నువ్వు మేకకి ఆకులు పెట్టినట్లు పెడుతున్నావ్ !

అతిమధురం : మాటలు మితి మీరి వస్తున్నాయ్ !

శాంతమూర్తి : నువ్వంటే ఊరుకునేవళ్ళెవరూ లేరిక్కడ !

అతిమధురం : గాడిదలాగా గుయ్‌గుయ్‌న పడితే మాట్లాడలేరని లెక్క -

శాంతమూర్తి : నువ్వే గాడిదవి ! నక్కవి, పిల్లివి ... చెవుల పిల్లివి -

అతిమధురం : గాడిదా ! ఇదుగో !

(అని చేతిలో ఉన్న Glass లో ఉన్న షర్బతు అతని మీద విసురుతుంది ... అది సన్యాసయ్య మీద పడుతుంది)

సన్యాసయ్య : ఓ ...

అతిమధురం : అయ్యో ! చూడలేదు ! ... క్షమించాలి ... మీ మీద పడుతుందనుకోలేదు ...

శాంతమూర్తి : గుడ్డి పక్షి ... చూడలేదు ... క్షమించాలి ... పెద్దమనిషి మీద అట్లా పోస్తే నేనూరుకుంటానా ? (అని తానూ పోస్తాడు ... కావాలని సన్యాసయ్య వైపు)

సన్యాసయ్య : అయ్యో ... అయ్యో ...

అతిమధురం : (కోపంతో) నేనేం చేస్తే అది చెయ్యటం కాదు ... మగడి వైతే పౌరుషం ఉన్న పని చెయ్యి -

శాంతమూర్తి : ఇందాక సరిగ్గా గురి చూడలేదు ... ఇప్పుడు చూస్తాగా ... ఈ సారి గురి తప్పదు ... (అంటూ జేబులోంచి Revolver తీస్తాడు) ఇప్పుడు చూడు ...

(అంటూ అతిమధురం మీదికి గురిపెడతాడు)

అతిమధురం : అమ్మో ! రక్షించండి ... రక్షించండి ...

(అని సన్యాసయ్య వెనకకి వెళ్ళి దాక్కుంటుంది)

శాంతమూర్తి : ఇవ్వాళతో నీ పీడ పదిలిపోవాలి ...

(శాంతమూర్తి అతిమధురంని కాల్చాలని అలంగం తిరుగుతూ వుంటాడు ... సన్యాసయ్యని పట్టుకుని అతని వెనక దాక్కుని అతిమధురం ... Stage అంటా తిరుగుతుంది)

సన్యాసయ్య : నన్ను ఒదిలిపెట్టు ... ఇహ చాలు ... నన్ను వదలండి ...

శాంతమూర్తి : కదలకండి ... అడ్డం లేవయ్యా –

అతిమధురం : వద్దు వద్దు ... అడ్డం లేవద్దు ...

శాంతమూర్తి : తరువాత అనుకుని ప్రయోజనం లేదు ... నేను Pistol పేల్చబోతున్నాను ... అడ్డు లేవండి ...

అతిమధురం : అక్కడే నిలబడండి ... తప్పుకుంటే కాల్చిపారేస్తాడు ... రక్షించండి ... ఎట్లాగయినా నా ప్రాణాలు తియ్యడానికి చూస్తున్నాడు ...

శాంతముర్తి : అడ్డం లేవరన్నమాట ... మీ దురదృష్టం ... ముందు వాళ్ళని కాలిస్తే కాని వెనక ఉన్నవాళ్ళు బయట పడరు ...

సన్యాసయ్య : అమ్మో ! దయదలచి నన్ను వదలిపెట్టండి ... ఇంకా నాలుగు రోజులు బతకాలని ఉంది నాకు ... ఇవ్వాళ ఎవరి మొహం చూశానో -

అతిమధురం : ఆ ! నాకో గొప్ప ఆలోచన వచ్చింది ... (అని Lights ఆపి) ఆ ఇప్పుడు కాల్చు ఎట్లా కాలుస్తావో !

(Stage, Auditorium - రెండూ చీకట్లో ఉన్నాయి ... మాటలు, విసిరిన వస్తువుల తాలూకు చప్పుళ్ళు వినిపిస్తున్నాయి)

అతిమధురం : నన్ను చంపుతావు కదూ ! ఈ దెబ్బ రుచి చూడు ...

(దెబ్బ కొట్టిన చప్పుడూ)

సన్యాసయ్య : అమ్మో ! కొట్టింది నన్నమ్మో !

శాంతముర్తి : ఇది కాచుకో !

సన్యాసయ్య : అమ్మో ! నన్ను కొడతారేమర్రో !

అతిమధురం : రాక్షసుడా !

(మళ్ళీ దెబ్బ)

శాంతమూర్తి : దున్నపోతా !

(ప్రతి దెబ్బా సన్యాసయ్యకే తగులుతుండటం వల్ల అబ్బో, అయ్యో, అమ్మో - అంటూ గోలపెడతాడు)

అతిపధురం : నీ రోగం కుదురుస్తాను ఆగు ... ఇదుగో పిండి దెబ్బ !

(కుమ్మరించిన చప్పుడు)

శాంతముర్తి : ఇదిగో కారం దెబ్బ !

సన్యాసయ్య : అయ్యో ! ఇది మీకు న్యాయం కాదు ... చీకట్లో కట్టి పడేసి వంటింట్లో వస్తువులన్నీ నా మీద పొయ్యటం భావ్యం కాదు !

శాంతమూర్తి : నువ్వాగవయ్యా ! దీని పని చెబుతా - దాని సమాన్లన్నీ దాచుకుంది కదూ ! బీరువాలో ! అది ఇవ్వాళ Smash ...

అతిమధురం : దాన్ని ముట్టుకుంటే పిచ్చి కుక్కను కరిచినట్లు కరుస్తాను ...

(శాంతమూర్తి, మధురం ఇద్దరూ అటు ఇటూ పరుగెత్తుతారు)

సన్యాసయ్య : అయ్యో ! అయ్యో ! నా మొహం మీద నుంచి పరిగెత్తురున్నారండీ ...

శాంతమూర్తి : భడవాకానా నిన్ను పట్టుకుని చితకకొటితే కాని -

అతిమధురం : పట్టుకున్నప్పుడు కదా !

శాంతమూర్తి : పిల్లిలా పరిగెత్తడం చాతనవును –

అతిమధురం : నక్కలా పీక్కుతినడం నాకు చేతకాదు –

(పరిగెత్తుతూ సన్యాసయ్యని తన్నుతూ వుంటారు ...)

సన్యాసయ్య : (ఏడుస్తూ) అయ్యో ... ఊరుకోండ్రా ... మీకేం పోయే కాలంరా - ఎరక్కపోయి వచ్చాన్రా దేవుడా ...

శాంతమూర్తి : ఇహ ఇవాళ నీ ఆయుష్షు మూడినట్టే - నడు - నువ్వు ఎక్కడ నక్కినా నిన్ను కాల్చక వదలను - కదలకు ...

(సన్యాసయ్య ఓ మూలగా నక్కి వుంటాడు ... శాంతమూర్తి బయటకు లాగుతాడు మెడబట్టి ... ఆయన వెనకాల దాక్కున్న అతిమధురం పరిగెత్తుతుంది ... సన్యాసయ్యని తన్నుకుంటూ ... రెండో వైపు నుంచి తన్నుకూంటూ శాంతమూర్తి ఒకరిని ఒకరు తరుముతూ తెరలోకి వెడతారు ... తెర ఎత్తే సరికి సన్యాసయ్య ఒంటి నిండా పిండి, కారం ... రకరకాల రంగులు ... కళ్ళు కనిపించవు ... ఆపసోపాలు పడుతూ లేచి కూర్చుని)

సన్యాసయ్య : ఈ రాక్షసుల చేతుల్లో పడ్డనేమిట్రా దేవుడా ?

(మెల్లగా లేవబోతుంటే కింద పిండి సన్నగా ఉండడం వల్ల దానిలో జారి పడతాడు ... వెళ్ళబోతూ ఉండగా)

శాంతమూర్తి : (తెర లోపలి నుంచి తొంగి చూస్తూ) వెళ్ళకండి సన్యాసయ్యగారూ ... మంచి పెసరట్టు ... ఉప్మా -

అతిమధురం : ఆ తరువాత అమృతం లాంటి Coffee - వెళ్ళకండి ...

(సన్యాసయ్య "బాబోయ్" అంటూ ఒక్క పరుగున పరుగెత్తుతాడు ... వెనక నుంచి శాంతమూర్తి, "వెళ్ళకండి సన్యాసయ్య గారూ ! ఇంకా మా ఆతిథ్యం మొదలే కాలేదు" అంటూ పరుగెత్తుకుపోతున్న సన్యాసయ్యని వాకిలి వైపు నుంచి చెవులయ్య, ఇద్దరూ పట్టుకుని లాక్కొచ్చి కుర్చీలో కుదేస్తారు)

సన్యాసయ్య : ఒద్దులేద్దురూ ! నా దారిన నన్ను పోనివ్వండి ...

శాంతమూర్తి : అన్నన్నా ! ఎంత మాటన్నారు ! మా ఆతిథ్యం ...

సన్యాసయ్య : అయ్యా ! బుద్ధి తక్కువై ఒచ్చాను ! నన్నీసారికి ఒదిలెయ్యండి !

అతిమధురం : అమ్మో ! "అతిథి దేవోభవ !" అన్నారు ! తప్పు కాదుటండీ !

శాంతమూర్తి : (నవ్వుతూనే) అయ్యో ! ప్రతి సాయంకాలమూ వచ్చి ...

అతిమధురం : Coffee, Tiffin సేవించి ...

శాంతమూర్తి : కాదు కాదంటే భోజనం ...

సన్యాసయ్య : (ఏడుపు ముఖంతో) అయ్యా ! ఈ మాటలు ఎక్కడో విన్నట్టున్నాయే !

(లేస్తాడు)

శాంతమూర్తి : వినుంటారు !

(కుర్చీలో బలవంతంగా కుదేస్తారు)

అతిమధురం : అంతేనా ! ఆ తరువాత కాస్త దగ్గరయ్యాక ...

శాంతమూర్తి : చేబదులు ...

సన్యాసయ్య : అయ్యో ! అయ్యో ! ఇవన్నీ నేననుకున్న మాటలే ! మీ యిల్లు నేలగట్టా! ఇవన్నీ ఎలా భట్టీయం వేశారండీ !

చెవులయ్య : మీలాంటి మాస్టర్లుంటే భట్టీయం వెయ్యకపోతే నిలువునా చీరెయ్యరూ ?

(మళ్ళీ మొదటి సన్నివేశంలోని సన్యాసయ్య మాటలకి మొగుడూ పెళ్ళాలిద్దరూ పునశ్చరణ చేస్తారు)

శాంతమూర్తి : (సన్యాసయ్యను కుదేస్తూ) అబ్బా ! తలుచుకుంటూ వుంటే భవిష్యత్తు ఎంత భేషుగ్గా కనిపిస్తోందండీ !

సన్యాసయ్య : ఇంకా భవిష్యత్తేమిటండి నా బొంద ! వర్తమానమే యిలా తగలడి ఏడిస్తేనూ! మహాప్రభో ఇహ నన్ను వదిలెయ్యండి ...

శాంతమూర్తి : అన్నన్నా ! మీరు మా అతిథులండీ - (మళ్ళీ Repeat చేస్తూ) ఇహ జీవితమంతా యిట్లాగే ...

అతిమధురం : హాయిగా ...

శాంతమూర్తి : వీళ్ళని మంచి చేసుకుని ...

(ఇది జరుగుతున్నంతసేపు సన్యాసయ్య వెళ్ళడానికి లేచి నిలబడడం, భార్యభర్తలు కుర్చీలో కుదెయ్యడం, సన్యాసయ్య ఒకరిని విడిచి మరొకరి వైపు ఏడుపు ముఖంతో దీనంగా వేడుకోవడం చేస్తూ వుంటాడు)

అతిమధురం : ఇహ Coffee తాగడానికి కానీ ఖర్చుండదు ...

శాంతమూర్తి : తాగే శ్రమ తప్ప ...

చెవులయ్య : ఆమాట ఏరే సెప్పాలటండీ !

శాంతమూర్తి : భోజనం ఎక్కడా అని దిగులక్కర్లేదు !

అతిమధురం : పెట్టెలాంటి యిల్లు - బంగారం లాంటి జంట !

చెవులయ్య : ఆ మాట ఏరే సెప్పాలేటండీ !

సన్యాసయ్య : అయ్యా ! ఇవన్నీ నేనన్న మాటలే ! ... ఈ సన్యాసి వెధవ లోలోపల అనుకున్న మాటలన్నీ తమ కర్ణపుటాల్లోకి ఎలా వెళ్ళాయండీ ? అంతా మాయగా ఉంది !

చెవులయ్య : మాయ ఏముంది సన్యాసి స్వాములవారూ ! ... ఇందాక నాకు కితాబు ఇచ్చారుగా ! భోళా సన్యాసి ! మంచివాడు ! ... కాని (తల చూపుతూ) ఇది శున్యం !

సన్యాసయ్య : అయ్యో ! అయ్యో !

శాంతమూర్తి : కుర్చీలు గట్రా బాగానే వున్నాయిగా ? పాతసరుకు ... ఒరే సన్నాసీ ! అదృష్టం అలా కలిసి రావాలిరా ! వెతుకుతున్న తీగ కాలికి తగిలింది ఫో !

సన్యాసయ్య : (బిత్తరపోయి) నేను అన్న మాటలు ఉన్నవి ఉన్నట్టు, అన్నవి అన్నట్టు చెప్పుకొచ్చారు ... ఈ యింట్లో కర్ణపిశాచి గాని లేదు కదా !

శాంతమూర్తి : కర్ణపిశాచి లేదుగాని ... ఈ పిశాచం ఉంది ...

సన్యాసయ్య : ఎంతెంత మాటలంటున్నారు ?

అతిమధురం : నువ్వెంత నాన్చుడుగాడివో !

శాంతమూర్తి : ఎటువంటి వియ్యపురాలి జీడివో !

చెవులయ్య : ఎటువంటి పరాన్నభుక్కువో !

సన్యాసయ్య : ఈ మాటలు మాత్రం నేననలేదండీ !

చెవులయ్య : నేనంటున్నాను ... సరా ? నువ్వెంత దగుల్బాజీవో, ఇతరుల మంచితనాన్ని ఆసరాగా తీసుకుని పంచివాళ్ళని, మొహమాటస్తులని ఎట్లా విసిగిస్తావో తెలుసునయ్యా నాకు ...

సన్యాసయ్య : అయ్యా ! చెవులయ్యగారూ ! మీరు కూడా నన్ను ...

అతిమధురం : ఈ చెవులయ్య పేరు కాంతారావు ... మా అన్నయ్య ... నువ్వు ప్రతిరోజూ వెళ్ళి విసిగించడంతో ...

చెవులయ్య : నీ నుంచి తప్పించుకోవడం ఎట్లారా భగవంతుడా అని బాధపడుతున్న వాళ్ళని !

అతిమధురం : ఇంట్లోనే వుండి బయట తాళం వేసి నీ నుంచి మా బావ, అక్కయ్యలని కాపాడిన !

శాంతమూర్తి : అపర శ్రీకృష్ణుడు !

సన్యాసయ్య : ఈ బావగారెవరండీ కొత్తగా !

చెవులయ్య : నువ్వు వెయ్యి రూపాయలు అప్పు తీసుకుని, ఏమీ ఎరగనట్టు నటిస్తూ, వాళ్ళే నీకు బాకీ ఉన్నారన్న పద్ధతిలో ...

అతిమధురం : టంచన్‌గా అయిదింటికి Tiffin, Coffee లకు వచ్చేవాడివే !

చెవులయ్య : ఆ రాజారావుగారి బావమరిదిని కూడా !

సన్యాసయ్య : (అమాయకంగా) అయ్యా ! మీరు రాజారావు గారి తాలూకని తెలియకుండా వచ్చి పొరపాటు చేశాను ... చెవులయ్యగారూ !

అతిమధురం : కాంతారావు ...

సన్యాసయ్య : అదే ! (కాంతారావుతో) నాని మీ మాట, మీ వేషం చూసి నిజంగానే మీరు ఈ యింట్లో ఎన్నేళ్ళ నుంచో పనివాడనుకున్నాన్సుమండీ ! ... ఏం వేషం ! ఏం యాస ! ... చక్కగా అతికినట్టు కుదిరాయి ... మీరు గొప్ప Hero అండీ !

చెవులయ్య : Thank You ...

సన్యాసయ్య : మీరు Cinema ల్లోకి వెడితే ... మహామహా వాళ్ళకే తలదన్ని పోతారండీ !

చెవులయ్య : (పొంగిపోతూ) మరేమనుకున్నావ్ ! (అప్పుడు తనను ఉబ్బేస్తున్నాడని గ్రహించి) ఓరోరి ! నా మీదే ప్రయోగిస్తున్నావ్ నీ పొగడ్తల మంత్రాన్ని !

సన్యాసయ్య : పొగడ్తలు కాదు చెవులయ్యగారూ ! నిజ్జంగా మీరు ...

చెవులయ్య : చాల్లేవయ్యా ... బయటకు నడు ... విన్నావా శాంతమూర్తీ ! నేను చెబితే మీ మొగుడూ పెళ్ళాలిద్దరూ - "ఛా ! ఆయనటువంటివాడు కాదోయ్ !" అని నువ్వూ, "పాపం ! మంచివాడేరా !" అంటూ యిదీ - తెగ పొగిడేవారు ! ఇటువంటి ఆషాఢభూతిలకి - ఇక పదవయ్యా పెద్దమనిషీ !

(అని రెక్కలు పట్టుకుని గుమ్మందాకా తోస్తూ తీసుకువెడతాడు)

సన్యాసయ్య : అయ్యా ! ఇందాక నామానాన నేను పోతూ వుంటే లాక్కొచ్చి ఈ కుర్చీలో

దిగేశారు! ఇప్పుడు మళ్ళీ బయటికి నడు అంటున్నారు ... ఇదేమన్నా న్యాయంగా ఉందా ? మీరన్నా చెప్పండి శాంతమూర్తిగారూ !

శాంతమూర్తి : పదవయ్యా !

సన్యాసయ్య : (అతిమధురంతో) అమ్మా !

అతిమధురం : చాల్చాలు, నడవండి !

సన్యాసయ్య : (మరీ దీనంగా) చెవులయ్యగారూ ! ... క్షమించండి ... కాంతారావుగారూ !

ముగ్గురూ : పోతావా, లేదా ...

శాంతమూర్తి : నడు ...

అతిమధురం : బయటకు నడు ...

చెవులయ్య : మళ్ళీ ఈ ఛాయల్లో కనిపించకు ...

(అంటూ సన్యాసయ్య మీదిమీదికి వచ్చి వాకిట్లో నెట్టేస్తాడు ... వెనక్కు తిరిగి ఊపిరి పీల్చుకుంటాడు)

అతిమధురం : పెద్ద ఆపద నుంచి తప్పించావురా అన్నయ్యా !

శాంతమూర్తి : ఆ సన్నాసి ఆ జుట్టు ... భలే Act చేశావురా !

అతిమధురం : చిన్నప్పుడంతా నాటకాలంటూ తిరిగాడుగా - ఆ ఛాయలు పోలా !

(శాంతమూర్తి, అతిమధురం నవ్వుకుంటూ వుండగా సన్యాసయ్య బయట నుంచి తొంగి చూస్తాడు)

సన్యాసయ్య : అయ్యా !

(ముగ్గురూ ఖంగుతిని వెనక్కు తిరుగుతారు)

చెవులయ్య : నువ్వింకా పోలా ?

సన్యాసయ్య : మీరు క్షమిస్తే - ఒక్క అనుమాన నివృత్తి చేసుకోవాలని మళ్ళీ వచ్చాను !

చెవులయ్య : ఏమిటి ?

సన్యాసయ్య : అదే ! నేను మాట్లాడిన మాటలన్నీ, అన్నవి అన్నట్టే వీళ్ళిద్దరూ చెప్పారు గదా !

అతిమధురం : చెప్పాం ... చెబుతే ... ?

సన్యాసయ్య : ఏమీలేదు ! అవి మీరు Record చేశారా అని ...

శంతమూర్తి : చేస్తే ...

సన్యాసయ్య : ఒక Copy నాకిస్తారేమోనని ...

చెవులయ్య : ఎందుకో ?

సన్యాసయ్య : మీరు కోప్పడనంటే చెబుతా ...

శాంతమూర్తి : చెప్పు ...

సన్యాసయ్య : ఈ యింట్లో ఏం తప్పుగా మాట్లాడానో తెలుసుకుంటే గదా మరో యింట్లో యీ తప్పు చెయ్యకూండా ఉండడం ... అందుకని !

చెవులయ్య : మళ్ళీ ఉంకోళ్ళకు ఎసరు పెట్టే ఉద్దేశం ఉందన్నమాట ... నువ్వింత గుండెలు తీసిన బంటువని చెబితే వీళ్ళిద్దరూ నమ్మలా ... వాళ్ళని

నమ్మించడానికి ఈ గదిలో ఒక Mike కనిపించకుండా బిగించా ... వాళ్ళ గదిలో ఒక Speaker పెట్టా ... నీ మాటలన్నీ వాళ్ళకి Loud Speaker లో వినిపించినట్లు వినిపించగా ... వాళ్ళకి నీ విశ్వరూపం తెలిసొచ్చింది !

సన్యాసయ్య : Secret Camera ల్లాగా Secret Phone లు కూడానీ ! Technology Bedroom ల్లోకి వచ్చిందంటే ఇదేనన్నమాట !

చెవులయ్య : కాదు ... నీలాంటి దగుల్బాజీలు, మోసగాళ్ళు ఎత్తులకు పై ఎత్తులు వేసి జనాన్ని నిలువునా ముంచేస్తూ వుంటే ఎన్ని Technology లయినా వస్తాయి!

సన్యాసయ్య : అయ్యా ... మీరిట్లా నిఘా వేసి మరీ నన్ను పట్టిస్తారని తెలియకా ...

శాంతమూర్తి : నువ్వు ఒట్టి జిడ్డు మనిషివా ? మా బావ చెబితే నాకు తెలియలా ? నువ్వు మరి కొంచెం సేపు ఉంటే నేనేం చేస్తానో నాకే తెలియదు !

సన్యాసయ్య : మీరు మరీ అన్యాయంగా మాట్లాడుతున్నారు !

శాంతమూర్తి : ఛీ ! నీలాంటి వాడి Photo లు తీసి - వీధుల్లోనూ, Coffee Hotel లలోను అతికించాలి !

సన్యాసయ్య : మరీ నన్ను దొంగ కింద కట్టేస్తున్నారు !

చెవులయ్య : నువ్వు మెత్తని దొంగవి - శాంతమూర్తీ ! ఇతడు మాటలతో వినడు – ఇతన్ని జాగ్రత్తగా పట్టుకిని ఉంచండి ... Camera తెచ్చి ఇతని Photo తీసి Police Station లో మా రామచంద్రానికిచ్చి "ఈ మనిషితో జాగ్రత్త !" అని వాళ్ళ K.D. ల List లో పెట్టిస్తా ... పోనివ్వకండి ...

సన్యాసయ్య : నేను వెళ్ళిపోతున్నానండీ అంటే ఈ అఘాయిత్యమేమిటండీ ? (శాంతమూర్తితో) బబ్బాబు ! మీరయినా రక్షించండి !

(శాంతమూర్తీ, అతిమధురం కలిసికట్టుగా)

ఇద్దరూ : వాడు అన్నంత పనీ చేస్తాడు ...

సన్యాసయ్య : ఏ ముహూర్తాన బయల్దేరానో గాని ...

(అంటూ వెళ్ళబోతాడు)

శాంతముర్తి : వెళ్ళకండి ... వెళ్ళకండు ...

అతిమధురం : ఒరే కాంతారావూ ...

సన్యాసయ్య : అయ్యా ! రక్షించండి మహాప్రభో !

(వాళ్ళిద్దరూ చెడుగుడు ఆడినట్లు - వాళ్ళు అడ్డం పడడం - సన్యాసయ్య తప్పించుకోవటానికి చూస్తూ ఉండగా)

చెవులయ్య : (లోపలి నుంచి) వస్తున్నా ! అతిథిని పట్టుకుని వుంచండి !

సన్యాసయ్య : అమ్మ బాబోయ్ ! ఆతిథ్యం మాట దేవుడెరుగు ! ముందు ప్రాణాలు కాపాడుకోవాలి !

(అడ్డంగా వున్న శాంతముర్తి, అతిమధురాలను తప్పించుకోవాలని చూస్తాడు - ఒక్కసారిగా లోపలి గుమ్మం వైపుకు చూస్తూ)

సన్యాసయ్య : అయ్యా ! చెవులయ్య మహానుభావా ! మీరే దిక్కు !

(శాంతముర్తి, అతిమధురం ఆ గుమ్మం వైపు చూస్తూ వుండగా సన్యాసయ్య

తప్పించుకు పారిపోతాడు ... శాంతమూర్తి, అతిమధురం ఒకేసారి)

ఇద్దరూ : ఆగండి ... వెళ్ళకండి ... సన్యాసయ్యగారూ ! మంచి Coffee - పసందైన భోజనం !

(చెవులయ్య Camera తో వస్తాడు ... శాంతమూర్తీ, అతిమధురానికి మంచి Pose లో Photo తీస్తాడు ... నవ్వుతూ సన్యాసయ్య వెళ్ళిన వైపే చూస్తూ వుంటారు)

(తెర)

RASARANJANI THEATRE LIBRARY
VEMPATI RADHAKRISHNA COLLECTION
రసరంజని
RASARANJANI